క్లుప్తంగా

తొలిప్రయత్నంలోనే అధ్యాపకురాలిగా ఎంపిక


నియామకపత్రం అందుకుంటున్న దర్శిశ్రీ

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగ నియామక పరీక్షల్లో కొత్తగూడేనికి చెందిన దర్శిశ్రీ రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు హైదరాబాద్ రవీంద్రభారతిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ నియామకపత్రం అందుకున్నారు. గురువారం కొత్తగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అయ్యారు. ఇంటర్ వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విద్యను అభ్యసించానని, ఎంటెక్ పూర్తి అయిన వెంటనే ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉందని, విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే అవకాశం రావడం గర్వంగా ఉందని దర్శిశ్రీ తెలిపారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు



జూలూరుపాడు: మండలంలోని కాకర్ల శ్రీ రుక్మిణి సహిత సంతాన వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఢిల్లీ వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత చైర్మన్ చెరుకుమల్లి కృష్ణయ్య పదవీ కాలం ముగియడంతో గ్రామస్తులు గురువారం వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... దైవకార్యక్రమాలతోపాటు, ఆలయ అభివృద్ధి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణయ్యను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పొన్నెకంటి సతీష్ కుమార్, సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం, చావా వెంకటరామారావు, పదిమల రాంబాబు, కల్యాణపు వెంకటప్పయ్య, రాచబంటి వెంకటనర్సయ్య, చెరుకుమల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేణుగోపాల స్వామి కల్యాణం

జూలూరుపాడు: కాకర్ల గ్రామ సమీపంలోని పాలగుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీ రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హోలీ పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం విగ్రహాల ఊరేగింపు, రాత్రి 7 గంటలకు శ్రీ రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఢిల్లీ వెంకటేశ్వర్లు తెలిపారు.

నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

టేకులపల్లి: ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ ప్రజాసంఘాల నాయకులను బోడు పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు గురువారం కిసాన్ సంయుక్త మోర్చా ఎస్‌కేఎం జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న నాయకులు ఎట్టి నరసింహారావు, మేకల వినోద్‌లను బోడు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎంఎస్‌పీ ఇవ్వాలని, రైతులకు సబ్సిడీ ఇవ్వాలని, వ్యవసాయ నూతన చట్టాలను రద్దు చేయాలని, తక్షణమే అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

క్రిస్టియన్ కౌన్సిల్ ఎన్నిక


మాట్లాడుతున్న బిషప్ సుదర్శనం

జూలూరుపాడు: మాచినేనిపేట తండా గ్రామంలో పాస్టర్ తిమోతీ ఆధ్వర్యంలో కల్వరి క్రీస్తు మహిమ ప్రార్థన మందిరంలో గురువారం పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ ఎండీ సుదర్శనం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా బి.బిచ్చునాయక్, సెక్రటరీ జి.ఇస్సాక్, ఉపాధ్యక్షుడు ఎం.నిరీక్షణరావు, కోశాధికారిగా బి.విజయరాజు, జాయింట్ సెక్రటరీగా డి.తిమోతి, మండల మహిళా అధ్యక్షురాలిగా సిస్టర్ జి.బేబిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నిరీక్షణరావు, అద్భుత్ కుమార్, డానియేలు, సంతోష్‌రావు, కిరణ్, మురారి పాల్గొన్నారు.

అంతటా హోలీ సందడి..

- మార్కెట్‌లో రంగుల అమ్మకాలు
- రసాయనాలతో ప్రమాదమంటున్న వైద్యులు
- సహజసిద్ధ రంగుల వాడకంపై ప్రజల్లో కొరవడిన అవగాహన


కొత్తగూడెంఅర్బన్: రైతుబజార్‌లో హోలీ వేడుకలో మహిళలు

కొత్తగూడెంఅర్బన్/కొత్తగూడెంటౌన్/ఇల్లెందు: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా హోలీ పండుగను ప్రజలందరూ ఘనంగా జరుపుకుంటారు. శుక్రవారం రోజు హోలీ పండుగ కావడంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. హోలీ రోజు రంగులతో ఆడటంతో వసంత రుతువుకు స్వాగతం పలుకుతారు. చిన్నా, పెద్దలు అంతా కలిసి సంతోషంగా జరుపుకునే పండుగ హోలీ. ప్రతీఒక్కరు చిన్నపిల్లలుగా మారిపోయే వేడుకంటే హోలీనే. ఎంతసేపు ఆడినా కూడా తనివి తీరదు, సమయమూ తెలియదు. ఒళ్లంతా రంగులతో నిండిపోతే మనస్సుకి తెలియని ఉత్సాహం. వసంత రుతువు రాక.. శీతాకాలం ముగింపు.. వేసవికాలం ప్రారంభం సందర్భంగా చెడుపై మంచి విజయాన్ని సూచిస్తూ జరుపుకునే పండుగ. ఒకవైపు ముస్లింల పవిత్ర రంజాన్ మాసం కావడం అందులో శుక్రవారం కావడంతో పాటు హోలీ పండగ ఉండటంతో ప్రజలు పండుగను సామరస్యంగా జరుపుకునేందుకు మత పెద్దలు, పోలీసులు పలు సూచనలు సలహాలను సైతం ఇస్తున్నారు. గతంలో హోలీ పండుగ అంటే మోదుగ పూలు తెచ్చి రాత్రంతా వాటిని మరిగించి అవి పసుపు రంగులోకి మారేంత వరకు ఉంచి ఆ తరువాత రంగులను చల్లుకునేవారు. ప్రస్తుతం వ్యాపార లాభాల కోసం రసాయన రంగులను అమ్మకాలు చేస్తుండడంతో వాటిని చల్లుకోవడం వలన ప్రమాదకరంగా మారుతోంది. చర్మ వ్యాధులు, కంటి సమస్యలు వస్తున్నాయి. అందుకు సహజంగా చెట్ల ఆకులు, పూల నుంచి వచ్చే రంగులను చల్లుకొని పండుగను సంతోషంగా జరుపుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

హోలీకి పండుగ సంప్రదాయాలకు ప్రతీక..

హోలీ పండుగ శీతాకాలం ముగిసిన వసంత రుతువు రాకను సూచిస్తుంది. ఈ సమయంలో ప్రకృతి మళ్లీ పుంజుకుంటుంది. హోలీ రోజు రంగులతో ఆడటంతో వసంత రుతువుకు స్వాగతం పలుకుతారు. హోలీ పండుగకు ఒకరోజు ముందు అర్ధరాత్రి కాముడు పున్నమి కావడంతో హేలిక అనే రాక్షసుడి ప్రతిమ దహనం చేస్తారు. ఆ మంటల్లో ఎండు కొమ్మలు, వ్యర్థాలు వేసి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. తెల్లవారు జాము వరకు యువతతో పాటు చిన్నారులు, పెద్దలు సంతోషంగా గడుపుతారు.

దాండియా ఆటలు..

కొత్తగూడెం, ఇల్లెందులోని పలు ప్రాంతాల్లో ప్రజలు హోలీ సంబురాలు జరుపుకుంటారు. మార్వాడీ కుటుంబాలు, యువత అందరూ కలిసి దాండియా ఆడుతూ.. రాధాకృష్ణుల పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ సంబురాలను జరుపుకుంటారు. అదేవిధంగా ఒకరిపై ఒకరు రంగులను చల్లుకుంటూ, మరికొందరు రంగునీళ్లు చల్లుకుంటూ కేరింతలు కొడతారు.

మార్కెట్‌లో రంగుల అమ్మకాలు..

కొత్తగూడెం, ఇల్లెందులో చిరువ్యాపారులు రంగుల దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. వీటిలో ప్రధానంగా ప్లాస్టిక్, పారాణి, రసాయనాలతో కూడిన వివిధ రకాల రంగులను అమ్ముతున్నారు. ప్యాకెట్ రూ.20 నుంచి రూ.200 వరకు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో పాటుగా హోలీ రోజున రంగులు చల్లుకోవడమే కాకుండా యువత ఎక్కువగా కోడిగుడ్లను కొట్టుకోవడానికి ఇష్టపడుతున్నారు. దీనిని గమనించిన వ్యాపారులు దుకాణాల్లో గుడ్లను అమ్మకానికి ఉంచారు. వెండి రంగులో అల్యూమినియం, బ్రోమైడ్‌ను, ఎరుపులో మెర్క్యూరీ సల్ఫేట్ ఇవి కలిసిన రంగులను నీలం రంగులతో కాఫర్ సల్ఫేట్ ఆకుపచ్చ రంగు వంటివి క్యాన్సర్ వంటి వ్యాధులతో పాటు కంటికి, చర్మానికి హాని కలిగించేవి ఉంటాయి. ఇవి చర్మ సంబంధ రోగాలతో పాటు కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

అదేవిధంగా క్యాన్సర్ బారిన పడే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. హోలీ పండుగ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎక్సైజ్ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు హోలీ పండుగకు రంగులు చల్లుకున్న తరువాత వాగులు, నదులు, కాలువల దగ్గరకు స్నానాలకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మండల కేంద్రంలోని గ్రావిటీ స్కూల్‌లో గురువారం ముందస్తు హోలీ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులకు టీచర్లు పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

సంప్రదాయాలను పాటించాలి..



హోలీకి మోదుగు పూలతో తయారు చేసిన ప్రకృతి సిద్ధమైన రంగులనే చల్లుకోవాలి. ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. రసాయనాలతో ఆరోగ్యానికి ఇబ్బందులు వస్తాయి. ప్రతీఒక్కరు మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలి. సంప్రదాయ రంగులతో హోలీని సంతోషంగా జరుపుకోవాలి.

– కొట్టూరి సూర్వి రాజశేఖర్, కొత్తగూడెం

రంగులతో ప్రమాదం..



హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలంటే సహజసిద్ధమైన రంగులు వాడాలి. రసాయనాలతో కూడిన రంగులను వినియోగించడం వలన చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో పాటుగా కంటి సమస్యలు, కంటిచూపు కోల్పోయే ప్రమాదాలుంటాయి. అందుకే రంగులు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– వెంకన్న, జనరల్ ఫిజీషియన్, కొత్తగూడెం

పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది...



హోలీ పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలి. అపరిచితులపై రంగులు చల్లొద్దు. హాని కలిగించే రంగులకు దూరంగా ఉండాలి. అన్ని ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది. చెరువులు, వాగుల వద్దకు ఎవరూ ఈతకు, స్నానాలకు వెళ్లవద్దు. అటు రంజాన్.. ఇటు హోలీని ప్రజలందరూ సామరస్యంగా జరుపుకోవాలి.

– అబ్దుల్ రెహమాన్, డీఎస్పీ, కొత్తగూడెం


టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాలలో హోలీ సంబురాల్లో విద్యార్థులు, టీచర్లు


కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగా ప్లే స్కూల్‌లో...


కొత్తగూడెంలో రంగులు అమ్ముతున్న వ్యాపారి

పీఆర్సీ ప్రకటించండి..

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం ప్రకటించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరు నాయక్, రాములు నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులోని మెయిన్‌రోడ్ హైస్కూల్‌లో టీఎస్‌టీటీఎఫ్ మండల కమిటీ మహాసభ జరిగింది. జిల్లా అధ్యక్షుడు మోహన్, ఎంఈఓ స్వామి, లావుడ్యా రాందాస్, శ్యామ్లాల్, భిక్షపతి, మంగ్యా నాయక్, బాలకృష్ణ, రాజు, శ్రీను పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సమావేశం


హాజరైన పాలకవర్గం సభ్యులు

ఇల్లెందు: 2025–26 సంవత్సరం మార్కెట్ బడ్జెట్‌పై పాలకవర్గం చర్చించి ఆమోదించింది. గురువారం మార్కెట్ కమిటీ సమావేశం చైర్మన్ బానోతు రాంబాబు అధ్యక్షతన జరిగింది. మార్కెట్‌లో క్రయ విక్రయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులతో సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి

జూలూరుపాడు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు రుణ సహాయం అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ... దివ్యాంగుల రుణ సహాయం కోసం మండలానికి ఒక యూనిట్ మంజూరైందన్నారు. 127 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ముగ్గురిని ఎంపిక చేసి జిల్లా కేంద్రానికి పంపించడం జరుగుతుందన్నారు. వీరిలో ఒకరికి రూ.50 వేల రుణ సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ టి.తులసీరామ్, ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీఓ సలోమి పాల్గొన్నారు.

కనీస వేతనాలు నిర్ణయించాలి


మాట్లాడుతున్న కృష్ణయ్య

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు రూ.21 వేలు నిర్ణయించాలని, ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, క్రిష్టాఫర్ డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచకపోవటం వల్ల వారు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. వేతనాల పెంపునకు ఒకవైపు ప్రభుత్వంపై, యాజమాన్యంపై పోరాడుతూనే మరోవైపు చర్చల ద్వారా గుర్తింపు కార్మిక సంఘం తరుపున ఒత్తిడి తెస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, శ్రీను, గోపీ, సురేష్, కళావతి, పద్మ, లక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించండి..



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుజాతను కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందించారు. మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని, తక్షణం వాటిని పట్టించి సుదూరంగా విడిచి పెట్టించాలని కోరారు. రానున్న ఎండాకాలంలో మున్సిపాలిటీలో అన్ని బస్తీలలో, వార్డులలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని, కిన్నెరసాని నీటిని ప్రతీరోజు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిధులు మంజూరు చేసి పెండింగ్‌లో ఉన్న వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం ఏర్పాటు, ఇంటి నంబర్లతో కూడిన నేమ్ బోర్డులు, కరెంటు పోల్స్, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీనివాస్‌రెడ్డి, రావి రాంబాబు, బాలిశెట్టి సత్యభామ, మసూద్, పరమేష్ యాదవ్, తలుగు అనిల్, బాలిశెట్టి సుందర్ రాజ్, పీతాంబరం, బాల ప్రసాద్, సుందర్‌లాల్ కోరి, పల్లపు వెంకటేశ్వర్లు, బోసు, బండి రాజు గౌడ్, పాసి, జానీ పాషా, వాణి రెడ్డి, హైమావతి, పల్లపు వెంకటేశ్వర్లు, అమడగాని జయప్రకాశ్, హరి,రాజేష్, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ క్యాంప్

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దివ్యాంగ పిల్లల కోసం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. అంగవైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ శ్రీదేవీ ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పుట్టుకతో పోలియో బారినపడిన పిల్లలకు ఫిజియోథెరపీ క్రమం తప్పకుండా చేయడం వల్ల అంగవైకల్యాన్ని అధిగమించవచ్చన్నారు. ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ టి.తులసీరామ్, జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ నాగరమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అవకాశం కల్పించండి..


మాట్లాడుతున్న శ్రావణబోయిన నర్సయ్య

కొత్తగూడెంటౌన్: దేవస్థానాల్లో పాలకమండలిలను ఏర్పాటు చేయాలని తొలి ప్రాధాన్యం ఉద్యమకారులను ఇవ్వాలని తొలి,మలి 1969 తెలంగాణ ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం గాజులరాజం బస్తీలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారులకు, రాజకీయ నాయకులకు ప్రాధాన్యం తగ్గించాలన్నారు. సమాజంలో ఉద్యమకారులను, సమాజ సేవకులు, సామాన్యులను పాలకమండలిలో నియమించాలని పేర్కొన్నారు. జిల్లాలోని భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి, అన్నపురెడ్డిపల్లి శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి, పాల్వంచలోని పెద్దమ్మతల్లి దేవస్థానాలకు పాలకమండలిలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ప్రస్తుత దేవస్థానాల్లో ఈ సమావేశంలో దేవులపల్లి రామ్మూర్తి, శ్రీనివాస్, కిరణ్, కాకెల్లి సైమన్, ఎం.వలీబాబు, సప్తార్‌బేగ్, సలీం, సంగీతరావు, కవిత, కాటబోయిన మల్లయ్య, కొమ్ము వీరస్వామి, ఎస్‌కే జానిమియా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మొరంతో చదును

టేకులపల్లి: రాంపురం పంచాయతీ పాతతండాలో ఉన్న ముత్యాలంపాడు (హరిజన చెర్రి) ప్రాథమిక పాఠశాల ఆవరణ ఎత్తు పల్లాలతో వర్షాకాలంలో బురద సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. హెచ్ఎం ఎల్.లక్ష్మణ్, టీచర్ అనురాధ గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగా గురువారం పాఠశాల ఆవరణలో మొరం పోయించి లెవలింగ్ చేయించారు.

పెన్నులు అందజేత

పాల్వంచ: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి అత్యధిక మార్కులు సాధించాలని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రత్నకుమారి అన్నారు. గురువారం స్థానిక కరకవాగు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఈడీఎం సైదేష్ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను రత్నకుమారి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పదిలో మంచి మార్కులు సాధిస్తే ఇంటర్‌లో మంచి కాలేజీలో సీట్లు వస్తాయన్నారు. ఉన్నత స్థానాల్లో నిలిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు, టీచర్లకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఘనంగా కవిత పుట్టినరోజు వేడుక


కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలను స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. వనమా రాఘవేంద్రరావు, కాపు సీతాలక్ష్మి, కృష్ణ పాల్గొన్నారు.

లెప్రసీ కేసులను గుర్తించండి..

కొత్తగూడెంఅర్బన్: లెప్రసీ కేసుల గుర్తింపునకు ఇంటింటికి వెళ్లి స్క్రీనింగ్ నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.భాస్కర్ తెలిపారు. గురువారం వైద్యాధికారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఆశా వర్కర్లందరూ లెప్రసీ కేసు తగ్గింపు, నియంత్రణ కార్యక్రమాన్ని ఈనెల 17 నుంచి 31 వరకు నిర్వహించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ బాలాజీనాయక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం


ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ హైస్కూల్‌లో నిర్మిస్తున్న ఇంకుడు గుంత

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ముమ్మరంగా సాగుతోంది. నీటి వృథాను అరికట్టి భూగర్భ జలాలను సంరక్షించేందుకు తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతలు నిర్మించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మండలంలోని ప్రతీ గ్రామపంచాయతీలో రెండు ప్రభుత్వ కార్యాలయాలను ఎంపిక చేసి ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రారంభించారు. గుంత తవ్వడంతోపాటు కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న రాళ్లు, ఇసుక, కంకర వంటి వాటిని సేకరించి వాటితో నిర్మాణం చేపడుతున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలను ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి గురువారం పరిశీలించారు.

టేకులపల్లి: ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు టేకులపల్లి మండలంలోని 36 గ్రామపంచాయతీలలో గురువారం ప్రతీ గ్రామపంచాయతీకి ఒకటి చొప్పున ఇంకుడు గుంత నిర్మాణాలు చేపట్టారు. ఇందులో భాగంగా తొమ్మిదో మైల్ తండా ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కాళంగి శ్రీనివాస్, కార్యదర్శి కృష్ణకుమారి, భద్రం పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండా


మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: కష్టాల్లో ఉన్న పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండా ఒక్కటేనని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందులో సీపీఐ పట్టణ శాఖ 15వ మహాసభ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సారయ్య మాట్లాడుతూ... 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సీపీఐ నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన ఉందన్నారు. ఓట్లు, సీట్లు రాకపోయినా ప్రజలకు కష్టాలు వస్తే ప్రత్యక్షం అయ్యే చరిత్ర సీపీఐది అన్నారు. ఈ సందర్భంగా 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా ప్రసాద్, సహాయ కార్యదర్శిగా బోడ రవిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డి.శంకర్, నజీర్ అహ్మద్, బాస శ్రీనివాస్, కుమ్మరి రవీందర్, బొల్లి కొమురయ్య, వనీ, సారయ్య, కమటం చంద్రకళ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద నాగకృష్ణ, బయ్య అభిమన్యు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.6,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవ్యశ్రీ, రాంచరణ్, రవీందర్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా


ఆందోళన చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించి, జీఎం శాలేంరాజుకు వినతిపత్రం అందజేశారు. అంతకంటే ముందు పీవీకే–5 ఇంక్లైన్ గని ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. కొత్తగూడెంలోని వీకే ఓసీలో బొగ్గు వెలికి తీసే పనిని ప్రైవేట్‌కు అప్పగిస్తే, కొత్తగూడెం ఏరియా పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ ప్రయత్నాలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి మనుగడ, కార్మికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రైవేటీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సంస్థకు రావాల్సిన రూ.35 వేల కోట్ల బకాయిలను చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రైవేటీకరణకు ప్రభుత్వం పునరాలోచించుకోవాలని కోరారు. లేదంటే ఎటువంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. అన్ని కార్మిక సంఘాలు తమతో కలిసి వచ్చి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.